సాక్షి నంద్యాల

సోమవారం | 29 | మే | 2023



శాస్త్రోక్తంగా పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లకు శాస్త్రోక్తంగా ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. పల్లకీలో ఉత్సవమూర్తులను ఉంచి ఆలయ ప్రదక్షిణ చేశారు.



పదోన్నతుల ఆనందం

ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న పంచాయతీరాజ్ ఉద్యోగుల పదోన్నతుల కల నెరవేరింది. రాష్ట్ర ప్రభుత్వం అర్హత కలిగిన ఏఓ, ఈఓఆర్డీలకు ఎంపీడీఓలుగా పదోన్నతులు కల్పించింది. 8లో



భగ్గుమన్న భానుడు

కర్నూలు(అగ్రికల్చర్): భానుడి భగభగలతో ప్రజలు విలవిలలాడుతున్నారు. ఆదివారం రుద్రవరం మండలం పేరూరులో 44.4, ఆలూరులో 43.91 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

న్యూస్‌రీల్

శ్రీశైలంలో భక్తుల రద్దీ



భక్తులతో కిటకిటలాడుతున్న క్యూ

శ్రీశైలంటెంపుల్: వేసవి సెలవులు, ఆదివారం కావడంతో శ్రీశైల క్షేత్రానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లను దర్శనార్థం వచ్చిన భక్తులతో శ్రీశైలక్షేత్రంలోని పురవీధులు, ఆలయ క్యూలైన్లు కిటకిటలాడాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, తదితర రాష్ట్రాల నుంచి భక్తులు చేరుకున్నారు. పాతాళగంగలో పుణ్యస్నానాలాచరించి మల్లన్న దర్శనార్థం ఉచిత, ప్రత్యేక దర్శన క్యూలకు చేరుకోవడంతో అన్ని క్యూ కంపార్ట్‌మెంట్లు, క్యూలు కిక్కిరిసిపోయాయి. క్యూలలో వేచి ఉన్న భక్తులకు ఆలయ అధికారులు మంచినీరు, అల్పాహారాన్ని ఉచితంగా అందజేశారు.

నేడు స్పందన

నంద్యాల: స్థానిక వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ హాజరు కావాలన్నారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, నియోజకవర్గ, మండల స్థాయిల్లో కూడా యథాతథంగా స్పందన కార్యక్రమం ఉంటుందన్నారు.

పోలీసు స్పందన రద్దు

బొమ్మలసత్రం: జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమాన్ని అనివార్య కారణాలతో రద్దు చేశారు. ఈ మేరకు ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

నల్లమల ఘాట్‌లో లారీ బోల్తా

- స్తంభించిన ట్రాఫిక్



మహానంది: నంద్యాల–గిద్దలూరు నల్లమల ఘాట్‌రోడ్డులో ఆదివారం పత్తిలారీ బోల్తా పడటంతో రెండు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. ప్రకాశం జిల్లా అన్నంపల్లికి చెందిన గొల్ల రాజేష్ లారీలో పత్తిని గిద్దలూరు నుంచి నంద్యాలకు తరలిస్తుండగా చలమ, సర్వనరసింహ స్వామి ఆలయ సమీపంలో లారీ కట్టర్లు విరగడంతో రోడ్డుగా అడ్డుగా బోల్తాపడింది. దీంతో ఇరువైపుల వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సుమారు రెండు గంటల పాటు ఎక్కడి వాహనాలు అక్కడే ఆగిపోవడంతో మండుటెండలో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. మహానందికి వస్తున్న కర్ణాటక భక్తులు సుమారు 30 మంది రోడ్డుకు అడ్డుపడిన లారీని అతి కష్టం మీద పక్కకు తొలగించడంతో రాకపోకలు యథావిధిగా కొనసాగాయి. విషయం తెలుసుకున్న రోడ్‌సేఫ్టీ ఏఎస్‌ఐ కృష్ణుడు, పీసీ లక్ష్మణ్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు.

ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరించాలి



మాట్లాడుతున్న డీఎస్పీ మహేశ్వరరెడ్డి

బొమ్మలసత్రం: ప్రయాణికులతో ఆటో వాలాలు మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని డీఎస్పీ మహేశ్వరరెడ్డి సూచించారు. ఆదివారం స్థానిక వివేకానంద ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ప్రయాణికుల పట్ల మర్యాదగా ఉంటూ వారిని గమ్యస్థానాలకు చేర్చాలని చెప్పారు. ఆటో డ్రైవర్ వివరాలు ఆటోలో సీటు వెనుక ప్రయాణికుడికి కనిపించేలా ఉంచాలన్నారు. ప్రతి డ్రైవర్ యూనిఫామ్ తప్పక ధరించాలని, ప్రధాన కూడళ్లలో వద్ద వారికి సూచించిన స్థలంలో ఆటోలు నిలుపుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో ట్రాఫిక్ సీఐ షేక్ ఇస్మాయిల్, సిబ్బంది పాల్గొన్నారు.

2న పత్తికొండలో జాబ్ మేళా

కర్నూలు సిటీ: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వచ్చే నెల 2వ తేదీన పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మెగా జాబ్ మేళాను నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ శ్రీకాంత్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రీన్‌టెక్, హెటిరో, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్, డీ మార్ట్, హీల్ మై ఫ్యామిలీ, మణప్పురం ఫైనాన్స్, బ్లూ ఓషన్, శ్రీరాం చిట్స్, జేబీఎం, వైఎస్‌కే ఇన్ఫోటెక్, ఎస్ఎల్‌వీ ఎంటర్‌ప్రైజెస్, నవ భారత్ ఫర్టిలైజర్స్ తదితర కంపెనీలు ఈ జాబ్‌మేళాలో పాల్గొంటాయని తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి రూ.10 వేల నుంచి 25 వేల వరకు వేతనాలు ఉంటాయన్నారు. వివరాలకు 8309283980, 8500783459ను సంప్రదించాలన్నారు.

మట్టి పరీక్ష.. గట్టి ఫలితం

వ్యవసాయంలో రైతులు రాణించేలా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోంది. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు నేరుగా రైతుల దరికే చేర్చుతోంది. ఇదే క్రమంలో వ్యవసాయంలో పెట్టుబడి తగ్గించుకునేందుకు అవగాహన కల్పిస్తోంది. ఇందుకు శాస్త్రీయ పద్ధతిలో సేద్యం చేసేలా ప్రోత్సహిస్తోంది. నాణ్యమైన దిగుబడులతో లాభాలు పొందేలా భూసార పరీక్షలపై విస్తృత ప్రచారం కల్పిస్తోంది. విత్తనానికి ముందు మట్టి పరీక్షలు చేయించుకుని ఫలితాలను బట్టి నేలకు పోషకాలు అందించేలా వ్యవసాయాధికారుల ద్వారా సూచనలు అందిస్తోంది.



గడివేములలో భూసార పరీక్షకు మట్టిని సేకరిస్తున్న ఆర్బీకే సిబ్బంది



- భూసార పరీక్షలతో సత్ఫలితాలు
- ఎరువులు, పెట్టుబడుల ఆదా
- అధిక దిగుబడులకు ఆస్కారం
- జిల్లాలో 798 మట్టి నమూనాల సేకరణ
- త్వరలో రైతులకు చేరునున్న భూసార ఫలితాల పత్రాలు

నంద్యాల (సెంట్రల్): గాలిలో దీపం పెట్టి దేవుడిపై భారం వేసినట్లుగానే చాలా మంది రైతులు పంటకు కావాల్సిన పోషక విలువలు భూమిలో ఉన్నాయో.. లేవో తెలుసుకోకుండానే వ్యవసాయం చేస్తున్నారు. అధిక దిగుబడులే లక్ష్యంగా రసాయన ఎరువులు, పురుగు మందులు విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. దీంతో నేల గుల్లబారి నిస్సారంగా మారుతోంది. ఈ క్రమంలో ఆశించిన దిగుబడులు రాక రైతులు నష్టపోతున్నారు. నంద్యాల జిల్లాలో ఏటా ఖరీఫ్‌లో దాదాపు 2.50 లక్షల హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. కాగా పంటల సాగుకు ముందు భూసార పరీక్షలు చేయించుకుని నేలకు అవసరమైన పోషకాలు అందిస్తే నాణ్యమైన దిగుబడులు పొందవచ్చునని వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 610 మట్టి నమూనాల లక్ష్యాన్ని నిర్దేశించగా, 798 వరకు శాంపిల్స్ సేకరించారు. మండల వ్యవసాయాధికారిని ఏజెంట్‌గా నియమించి మొత్తం 28 మండలాల పరిధిలోని 413 ఆర్బీకేల నుంచి మట్టి నమూనాలు సేకరించారు. భూసార ఫలితాలు పూర్తి కావచ్చినందున మూణ్నాలుగు రోజుల్లో నంద్యాల భూసార పరీక్ష కేంద్రం నుంచి పరీక్షల ఫలితాల పత్రాలు వ్యవసాయాధికారులకు పంపనున్నారు. వారంలోగా అన్నదాతలకు చేరనున్నాయి. భూమిలోని 16 పోషకాలు సమతుల స్థితిలో ఉంటేనే మొక్క పెరుగుదల, పూత, కాయ నాణ్యతగా ఉండి సమృద్ధికరమైన దిగుబడులు సాధించవచ్చు. వీటిలో ఏ పోషకం తక్కువైనా పెట్టుబడి వ్యయం పెరగడంతో పాటు నాసిరకం ఉత్పత్తులతో నష్టాల పాలయ్యే అవకాశం ఉంది. ఈ సమస్యను పరిష్కరించుకునేందుకు రైతులు రెండు, మూడేళ్లకోసారి తమ పొలాల్లోని మట్టిని పరీక్ష చేయించుకోవటం ఉత్తమమని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. భూసార పరీక్షల ద్వారా నేలలో లభ్యత పోషకాల స్థాయిని తెలుసుకోవచ్చు. దీంతో ఆయా పంటలకు వేయాల్సిన స్థూల పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాష్‌లతో పాటు, సూక్ష్మ పోషకాల మోతాదును నిర్ధారించుకోవచ్చు. అంతే కాకుండా భూమిలో చౌడు, సున్నం గుణాలు, విష పదార్థాల కలయిక (భూ కాలుష్యం జరిగినప్పుడు)ని గుర్తించి అవసరమైన యాజమాన్య పద్ధతుల్ని పాటించేందుకు అవకాశం ఉంటుంది. భూసార పరీక్షలు మూడు దశల్లో నిర్వహిస్తారు. ముందుగా ఎంచుకున్న పొలంలో మట్టి సేకరణ, సేకరించిన నమూనాలు ప్రయోగశాలకు చేర్చడం, అనంతరం ఫలితాల ఆధారంగా గుర్తించిన లోపాలకు తగిన ఎరువులు వినియోగించడం తప్పనిసరి. స్థానిక ఆర్ఏఆర్ఎస్ ప్రయోగశాలలోనూ భూసార పరీక్షలను నామమాత్రపు రుసుముతో చేయనున్నారు.

ఓ రైతు తెలుసుకో..

నల్ల చౌడు నేలలను, ఆమ్లనేలను పీహెచ్ ద్వారా తెలుసుకోవచ్చు. పొలాల్లో రసాయనిక ఎరువులు ఎక్కువగా వాడుతున్నారు. వాటిలో చౌడుశాతం పెరుగుతున్నాయి. వీటిని నివారించడానికి సేంద్రియపు ఎరువులు ఉపయోగించాలి. ముఖ్యంగా జీలుగ విత్తనాలు వల్ల నల్లచౌడు పోతుంది.

భాస్వరం ..

నేలలో భాస్వరం ఎంత వరకు ఉందో తెలుసుకోవడానికి కలోరి మీటర్‌ను ఉపయోగిస్తారు. ముఖ్యంగా వరి, మిరప, ఉల్లి, ఇతర కురగాయాలు పంటలకు 30 బస్తాల వరకు రసాయనిక ఎరువులు ఉపయోగిస్తే అటువంటి నేలలో ఎకరాకు 24 కిలోల కన్నా ఎక్కువ భాస్వరం ఉన్నట్లుయితే బాగుందని చెప్ప వచ్చు. ఒక వేళ ఎకరాకు 150 కిలోల భాస్వరం ఎక్కువ ఉంటే మొక్కకు జింక్, ఇనుము అందకుండా చేస్తాయి. పంట పండక ముందే ఎర్రగా వస్తుంది. ప్రారంభంలో దుక్కిలో కొంత భాస్వరం వేసుకోవచ్చు.

సూక్ష్మ పోషకాల లభ్యత

నేలలో జింక్, ఇనుము, బోరాన్, మాంగనీస్, కాపర్ వంటివి తప్పనిసరిగా కావాలి. వీటిని తెలుసుకోవడం కోసం అటామిక్ అబ్జార్షన్ స్పెక్ట్రోఫోటో మీటర్ పరికరాన్ని ఉపయోగిస్తారు. ఈ పరికరం ఎమ్మిగనూరు, కర్నూలు, డోన్ కేంద్రాల్లో ఉంది.

పొటాష్.. నేలలో పొటాష్‌ను ఫ్లేంఫోటోమీటర్ పరికరంతో తెలుసుకోవచ్చు. ప్రతి రైతు ఆరుతడి పైర్లకు ఎకరాకు 50 కిలోలలు పొటాష్‌ను వాడవచ్చు. వర్షాధారం కింద పొలాలకు ఎకరాకు 25 కిలోల పొటాష్‌ను ఉపయోగించవచ్చు.

నీటి పరీక్ష.. సాగుకు అందించే నీటిలో ఉప్పు, చౌడు నీళ్లు ఉంటాయి. చౌడు నీళ్లను పొలం తట్టుకోదు. ఈ నీళ్లు పారే కాలువలో జిప్సం 10 కిలోలు చొప్పున రెండు చోట్ల వేయాలి. నీళ్లు దుంకేచోటగానీ, ట్యాంకులోగానీ వేయవచ్చు. కొత్త బోరు, పాత బోరు, బావులలోని నీటిని పరీక్ష చేయించుకోవచ్చు.

ప్రయోగశాల సిఫార్సులు తప్పక పాటించాలి

భూసార ప్రయోగ కేంద్రంలో మట్టికి సంబంధించి ఉదజని సూచిక, నేల స్వభావం, లవణ సాంద్రత, సేంద్రియ కర్బనం, లభ్య పోషకాల స్థాయిని లెక్కిస్తారు. ఉదజని సూచిక 6.5–7.5 మధ్య ఉంటే అన్ని పోషకాలు సమృద్ధిగా ఉండే తటస్థ భూములుగా పేర్కొంటారు. 6.5 కంటే తక్కువగా ఉంటే ఆమ్ల భూములుగా పరిగణించి విరుగుడుగా సున్నాన్ని సిఫారసు చేస్తారు. పీహెచ్ 8 కంటే ఎక్కువగా ఉంటే క్షార భూములుగా తేల్చి జిప్సం వంటి పోషకాల్ని వినియోగించాలని అధికారులు సలహా ఇస్తారు. ఇలా నిర్ధారించిన తర్వాత తక్కువ స్థాయిలో పోషకాలుంటే సిఫారసు చేసిన దానికన్నా 25 శాతం అదనంగా ఎరువులు వేసుకోవాలి. ఎక్కువగా ఉంటే 25 శాతం తక్కువగా, మధ్యస్థంగా ఉంటే సిఫారసు మేరకు ఎరువులు అందించాలి. వీటితో పాటు గంధకం, జింక్, బోరాన్, ఇనుము, మాంగనీస్, కాపర్ తదితర సూక్ష్మ పోషకాలకూ ఇదే సూత్రం వర్తిస్తుంది.



ప్రయోగశాలలో భూసార పరీక్ష చేస్తున్న దృశ్యం

ఆర్బీకేల వారీగా భూసార పరీక్షలు



గతంలో భూసార పరీక్షలంటే ఓ సంక్లిష్టమైన వ్యవహారంలా ఉండేది. రైతు భరోసా కేంద్రాలు అందుబాటులోకి రావటంతో రైతన్న చెంతకే సేవలు చేరుతున్నాయి. ప్రతి ఒక్కరూ తమ పొలంలోని మట్టిని పరీక్షించుకుని వ్యవసాయాధికారుల సలహాలతో చక్కని దిగుబడులు సాధించవచ్చు. శాఖాపరంగా ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. ప్రయోగశాల నుంచి ఫలితాలను బట్టి నేలకు అవసరమైన సూక్ష్మ, స్థూల పోషకాలను అందిస్తే నాణ్యమైన దిగుబడులు సాధించే అవకాశం ఉంది.

– మోహనరావు, జిల్లా వ్యవసాయాధికారి, నంద్యాల

చంద్రబాబుది 'మహా' నాటకం



మాట్లాడుతున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి, చిత్రంలో మేయర్ బీవై రామయ్య తదితరులు

- ఎన్టీఆర్‌కు భారతరత్న రాకుండా అడ్డుకుంది బాబే
- విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు బీవై రామయ్య, కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కర్నూలు(రాజ్‌విహార్): అధికారం కోసం నాడు ఎన్టీ రామారావును వెన్నుపోటు పొడిచి, నేడు మహానాడు, ఎన్టీఆర్ శత జయంతి వేడుకలంటూ టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మహా నాటకం ఆడుతున్నారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు బీవై రామయ్య, కాటసాని రాంభూపాల్‌రెడ్డి విమర్శించారు. కర్నూలులోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టీడీపీ కుట్ర, వెన్నుపోటు రాజకీయాలు చూసి ఎన్టీఆర్ ఆత్మ క్షోభిస్తోందన్నారు. మహా నటుడి కుటుంబాన్ని మోసం చేసిన ద్రోహి చంద్రబాబుకు అధికారంలో ఉన్న 14 ఏళ్లలో ఎప్పుడూ ఎన్టీఆర్‌కు గుర్తుకు రాలేదన్నారు. ఎన్టీఆర్‌కు భారతరత్న రాకుండా అడ్డుకున్నారన్నారు. సీఎం కుమారులు మళ్లీ సీఎంలు అయితే.. లోకేష్ మాత్రం ఎందుకూ పనికిరాని పప్పులా తయారయ్యారని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వస్తే ఏం చేస్తారో చెప్పకుండా వైఎస్సార్‌సీపీ, సీఎం వైఎస్ జగన్‌ను తిట్టడమే మహానాడులో పనిగా పెట్టుకున్నారన్నారు. చంద్రబాబు నాటకాలు చూసి తెలుగు ప్రజలు సిగ్గుతో తలదించుకుంటున్నారన్నారు.

వైఎస్సార్‌సీపీదే మళ్లీ అధికారం

సంక్షేమానికి, అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇస్తూ సుపరిపాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీ 2024 ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి వస్తుందని బీవై రామయ్య, కాటసాని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ నేతలు పగటి కలలు కంటున్నారని, ఐసీయూలో ఉన్న తెలుగుదేశం పార్టీ కోలుకోదనే విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం చూసి ఓర్వలేక ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారన్నారు. పేదలకు ఇచ్చే స్థలాలను సమాధులతో పోల్చడం దుర్మార్గం అన్నారు. 14 ఏళ్ల అధికారంలో ఉన్న చంద్రబాబు ఏ నాడు పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వలేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇస్తుంటే అడ్డుకోవడం తగదన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్టీఆర్ పేరు చెబితే రూ.2కే కిలో బియ్యం, వైఎస్సార్ పేరు చెబితే ఉచిత విద్యుత్, ఆరోగ్య శ్రీ, జలయజ్ఞం, సీఎం జగన్ పేరు చెబితే అమ్మ ఒడి, ఆసరా, గోరుముద్ద, చేయూత తదితర పథకాలు గుర్తొస్తాయన్నారు. చంద్రబాబు పేరు చెబితే కుటిల రాజకీయాలు, అబద్ధాల హామీలు, మోసాలు గుర్తొస్తాయన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దయ్య మాట్లాడారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్, కార్పొరేటర్ శ్వేతా రెడ్డి, పార్టీ నాయకులు ధనుంజయ ఆచారి, సత్యం యాదవ్, ప్రశాంత్, లక్ష్మీ కాంతయ్య, షరీఫ్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

పగటి వేషగాళ్లలా టీడీపీ నాయకులు

- కుప్పం నియోజకవర్గానికి గుక్కెడు నీరివ్వని మాజీ సీఎం
- నారా లోకేష్ రాజకీయ అజ్ఞాని
- రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



ఎద్దుపెంట గ్రామంలో స్ప్రేయర్లను పంపిణీ చేస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



కంబాలపాడు సర్కిల్‌లో వైఎస్ఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి బుగ్గన

డోన్: రాష్ట్రంలో టీడీపీ నాయకులు ఆర్భాటపు అసత్య ప్రచారాలతో ప్రజలను నమ్మించేందుకు పగటి వేషగాళ్ల అవతారాలెత్తుతున్నారని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. డోన్ మండలంలోని ఎద్దుపెంట గ్రామంలో వాటర్‌షెడ్ కింద ఏర్పాటు చేసిన ఉత్పాదకత పెంపుదల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు 'బాదుడే బాదుడు, ఇదేం ఖర్మ' అంటూ ప్రజలను మభ్యపెట్టేందుకు పర్యటనలు చేస్తున్నారన్నారు. వీరి మాయమాటలను నమ్మి ప్రజలు మోసపోయే అమాయకులు కాదన్నారు. పాదయాత్ర చేస్తున్న నారా లోకేష్ రాజకీయ అజ్ఞాని అని మంత్రి విమర్శించారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు 8 సార్లు కుప్పం నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఎన్నికై మూడు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసి కుప్పం నియోజకవర్గానికి గుక్కెడు మంచినీరు కూడా ఇవ్వలేకపోయారని బుగ్గన ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే కుప్పం నియోజకవర్గంలో తాగు, సాగునీటి సౌకర్యం కల్పించిందన్నారు. కళ్లుండి అభివృద్ధి పనులను చూడలేని కబోదులు టీడీపీ నాయకులు అని మంత్రి బుగ్గన విమర్శించారు. సమావేశానికి ముందు వాటర్‌షెడ పథకం కింద రైతులకు సబ్సిడీపై స్ప్రింకర్లు, తైవాన్ స్ప్రేయర్లు, ఆయిల్ ఇంజన్లు, టార్పాలిన్లు, వాటర్ క్యారింగ్ పైపులను మంత్రి బుగ్గన అందజేశారు. అలాగే రైతులకు సబ్సిడీపై వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, వైస్ ఎంపీపీ ఎర్రిస్వామి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, ఆర్డీఓ వెంకటరెడ్డి, వాటర్‌షెడ్ పీడీ రామచంద్రారెడ్డి, ఏపీడీ సలీంబాషా, పీఓ విజేత, అగ్రికల్చర్ ఏడీఏ అశోక్‌వర్ధన్‌రెడ్డి, ఏఓ అబ్దుల్‌షఫి గ్రామ సర్పంచ్ బంగారు జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణులకు సముచిత గౌరవం..

నియోజకవర్గంలో బ్రాహ్మణులందరికీ సముచిత గౌరవం కల్పిస్తున్నామని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. ఆర్డీఓ వెంకటరెడ్డి, తహసీల్దార్ విద్యాసాగర్‌ల ఆధ్వర్యంలో ఆదివారం బుగ్గన తన స్వగృహంలో 130 మంది నిరుపేద బ్రాహ్మణ కుటుంబాలకు ఇంటి స్థలాలను పంపిణీ చేశారు. వారు తన ముందుంచిన మరికొన్ని డిమాండ్లను త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ప్యాపిలి మాజీ జెడ్పీటీసీ దిలీప్ చక్రవర్తి, అనంతపురం జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు జొహరాపురం శ్రీకాంత్, డోన్ అధ్యక్షురాలు కస్తూరి మూర్తి, పోస్టల్ రామారావు, ఎస్సీ క్రిష్ణమూర్తి, సుగుణాకర్‌రావు, విజయ్‌కుమార్‌శర్మ, శంకరశర్మ, న్యాయవాదులు కానాల మహేష్, శేషయనరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ పాలనలో విప్లవాత్మక మార్పులు

దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనలో విద్య, ఆరోగ్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని కంబాలపాడు సర్కిల్‌లో ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహాన్ని మంత్రి బుగ్గన ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైఎస్సార్ హయాంలో చేపట్టిన అనేక పథకాలు నిరుపేద, మధ్యతరగతి ప్రజల ఆర్థికాభివృద్ధికి ఎంతగానో దోహదపడ్డాయన్నారు. ఆరోగ్యశ్రీ, ఫీజురీయింబర్స్‌మెంట్, జలయజ్ఞం పథకాలతో వైఎస్సార్ ప్రతి పేదవాని గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. మునిసిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్ చైర్మన్‌లు కోట్రికె హరికిషన్, జాకీర్‌హుసేన్, పార్టీ జిల్లా బీసీ విభాగం అధ్యక్షులు పోస్టుపసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు చకచకా ఏర్పాట్లు

- పత్తికొండలో పర్యటించిన కలెక్టర్, ఎస్పీ
- అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని ఆదేశాలు



సభా ప్రాంగణం వద్ద సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ తలశిల రఘురాంతో చర్చిస్తున్న కలెక్టర్ సృజన

పత్తికొండటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పత్తికొండ పర్యటనకు చకచకా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఎలాంటి లోపాలు లేకుండా పక్కాగా ఏర్పాట్లు చేసేందుకు జిల్లా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఆదివారం జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన, ఎస్పీ జి.కృష్ణకాంత్, సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ తలశిల రఘురాం పత్తికొండలో పర్యటించి, సీఎం పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించారు. అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్, సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటు చేస్తున్న బహిరంగసభ వేదికలను పరిశీలించి, తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సభా ప్రాంగణంలోని కంపార్ట్‌మెంట్‌లలో వీఐపీల ఒకటి, పాత్రికేయులకు ఒకటి, మిగతా కంపార్ట్‌మెంటులు రైతులు, ప్రజలు కూర్చునే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. వీలైనంత ఎక్కువ మంది పారిశుద్ధ్య కార్మికులను కేటాయించి, సభాప్రాంగణం శుభ్రంగా ఉండేలా చూడాలని మున్సిపల్, గ్రామపంచాయతీ అధికారులను ఆదేశించారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున సభకు వచ్చే రైతులు, ప్రజలకు మజ్జిగ, తాగునీరు అందించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, ఇంటెలిజెన్స్ డీఎస్పీ(ఎస్ఎస్‌జీ) రాజారెడ్డి, పత్తికొండ ఆర్డీఓ మోహన్‌దాసు, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్‌కుమార్, రమణకాంత్, ఆర్అండ్‌బీ ఎస్ఈ నాగరాజు, పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

విమానాశ్రయంలో ఏర్పాట్ల పరిశీలన

ఓర్వకల్లు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలో భాగంగా స్థానిక ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విమానాశ్రయాన్ని ఆదివారం జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన, ఎస్పీ జి.కృష్ణకాంత్ సందర్శించారు. ఎయిర్ పోర్టులో పోలీసు బందోబస్తు, నీటి వసతి, వాహనాల పార్కింగ్, పారిశుద్ధ్యంపై చర్చించి, రన్‌వే, ల్యాండ్ స్కేప్ ప్రాంతాలను పరిశీలించారు.

1న పత్తికొండకు సీఎం వైఎస్ జగన్

కర్నూలు(సెంట్రల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జిల్లా పర్యటనలో స్వల్ప మార్పులు చోటు చేసుకున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదివారం రాత్రి ఓ ప్రకటనను విడుదల చేశారు. ఈనెల 30వ తేదీన సీఎం పత్తికొండలో జరిగే రైతు భరోసా సభకు హాజరు కావాల్సి ఉందని, అయితే కొన్ని అనివార్య కారణాలతో జూన్ 1వ తేదీకి షెడ్యూల్ మారినట్లు చెప్పారు. ఈ మార్పును అధికారులు, ప్రజలు గమనించాలని కోరారు. కాగా, జూన్ ఒకటో తేదీకి సంబంధించి సీఎం పర్యటన వివరాలను సీఎంఓ కార్యాలయం వెల్లడించింది.

సీఎం పర్యటన వివరాలు..

- జూన్ 1వ తేదీన 8.20 గంటలకు సీఎం ఇంటి నుంచి గన్నవరం ఎయిర్‌పోర్టు చేరుకుంటారు.
- 9.20 గంటలకు విమానంలో ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు చేరుకుని అక్కడ 9.30 గంటల వరకు ప్రజాప్రతినిధులతో మాట్లాడారు.
- 10 గంటలకు హెలికాప్టర్‌లో పత్తికొండకు చేరుకుని 10.10 గంటలకు రోడ్డు మార్గాన సభావేదికకు వెళ్తారు.
- 10.25 గంటలకు సెయింట్ జోసెఫ్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సభా వేదిక ప్రాంగణానికి చేరుకుని 10.35 గంటల వరకు ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తారు.
- 10.40 గంటలకు సభా వేదికపైకి వస్తారు. మంత్రులు ఎమ్మెల్యేలు ప్రసంగించిన అనంతరం రైతుల అభిప్రాయాలు తెలుసుకుంటారు.
- 11.15 నుంచి 11.50 మధ్య సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగం ఉంటుంది.
- 11.55 గంటలకు రైతు భరోసా నిధులను బటన్ నొక్కి అర్హుల జాబితాలో జమ చేస్తారు.
- 12.05 నుంచి 12.35 గంటల వరకు నాయకులతో మాట్లాడతారు.
- 12.40 గంటలకు సీఎం వైఎస్ జగన్ తిరుగు ప్రయాణమవుతారు.

పంచాయతీరాజ్‌లో పదోన్నతుల ఆనందం

- జిల్లాలో 25 మందికి ఎంపీడీఓలుగా పదోన్నతి
- అదనంగా జిల్లాకు వైఎస్సార్, ప్రకాశం జిల్లాల నుంచి ఇద్దరు కేటాయింపు
- ఉత్తర్వులు జారీ చేసిన పీఆర్ అండ్ ఆర్‌డీ కమిషనర్
- ఇక అన్ని మండలాలకు రెగ్యులర్ ఎంపీడీఓలు

కర్నూలు(అర్బన్): ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న పంచాయతీరాజ్ ఉద్యోగుల పదోన్నతుల కల నెరవేరింది. ఊహించని విధంగా రాష్ట్ర ప్రభుత్వం అర్హత కలిగిన ఏఓ, ఈఓఆర్‌డీలకు ఎంపీడీఓలుగా పదోన్నతులు కల్పించింది. ఈ మేరకు రాష్ట్ర పీఆర్‌అండ్‌ఆర్‌డీ కమిషనర్ ఏ సూర్యకుమారి జారీ చేసిన ఉత్తర్వులు శనివారం రాత్రి అందాయి. ఈ ఉత్తర్వుల మేరకు జిల్లాలో 12 మంది ఈఓఆర్‌డీ, 13 మంది ఏఓలకు ఎంపీడీఓలుగా పదోన్నతులు లభించాయి. అలాగే వైఎస్సార్, ప్రకాశం జిల్లాల నుంచి ఇద్దరికి ఎంపీడీఓలుగా పదోన్నతులు కల్పించి కర్నూలు జిల్లాకు కేటాయించారు. ఈఓఆర్‌డీ, ఏఓలకు అతి త్వరలో ఎంపీడీఓలుగా పదోన్నతులు లభించనున్నాయని ఈ నెల 27న 'సాక్షి' వెల్లడించిన విషయం తెలిసిందే. అర్హత కలిగిన ఏఓ, ఈఓఆర్‌డీలకు ఎంపీడీఓలుగా పదోన్నతులు కల్పించడంతో జిల్లాలోని 16 మండలాల్లో ఉన్న ఇంచార్జీల పాలనకు తెర పడినట్లవుతుంది. నాలుగైదు రోజుల్లో ఆయా మండలాల్లో రెగ్యులర్ ఎంపీడీఓలు బాధ్యతలు చేపట్టనున్నారు.

పదోన్నతులకు పెద్ద పీట ...

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీరాజ్ ఉద్యోగుల పదోన్నతులకు పెద్ద పీట వేసింది. అధికారంలోకి వచ్చిన ఏడాది లోపే 2020 జనవరిలో అర్హులైన ఏఓ, ఈఓఆర్‌డీలు 26 మందికి ఎంపీడీఓలుగా పదోన్నతులు కల్పించింది. అలాగే అదే ఏడాది అక్టోబర్ నెలలో డివిజనల్ కేంద్రాల్లో డీఎల్‌డీఓ పోస్టులను క్రియేట్ చేసి అర్హత కలిగిన ఎంపీడీఓలకు పదోన్నతులు కల్పించింది. 2022 ఆగస్టు 11న రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయంతో జిల్లాలో 14 మంది సీనియర్ ఎంపీడీఓలకు పదోన్నతులు లభించాయి. పలువురు ఎంపీడీఓలు జెడ్పీ సీఈఓ, డిప్యూటీ సీఈఓ, డ్వామా పీడీ తదితర పోస్టుల్లో నియమితులయ్యారు.

రెగ్యులర్ ఎంపీడీఓలు

కర్నూలు జిల్లాలో ఆస్పరి, హొళగుంద, తుగ్గలి, కొతాకం, కర్నూలు, పత్తికొండ, కృష్ణగిరి, వెల్దుర్తి, మంత్రాలయం, పెద్దకడుబూరు మండలాలకు రెగ్యులర్ ఎంపీడీఓలు రానున్నారు. అలాగే నంద్యాల జిల్లాలోని దొర్నిపాడు, కొలిమిగుండ్ల, గడివేముల, చాగలమర్రి, పాములపాడు, బనగానపల్లె మండలాల్లో కూడా కొత్త ఎంపీడీఓలు బాధ్యతలు చేపట్టనున్నారు.


జిల్లా పరిషత్ కార్యాలయం

మరింత వేగంగా పాలన



రాష్ట్ర ప్రభుత్వం అర్హత కలిగిన ఏఓ, ఈఓఆర్‌డీలకు ఎంపీడీఓలుగా పదోన్నతులు కల్పించడంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అన్ని మండలాల్లో పాలన వేగవంతం అయ్యే అవకాశాలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం 15 మండలాల్లో రెగ్యులర్ ఎంపీడీఓలు లేరు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం సర్వత్రా హర్షణీయం.

– జీ నాసరరెడ్డి, జెడ్పీ సీఈఓ

ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు



అర్హత కలిగిన ఏఓ, ఈఓఆర్‌డీలకు ఎంపీడీఓలుగా పదోన్నతులు కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు. అనేక సంవత్సరాలుగా పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్న వారి ఆశలు నేటికి ఫలించాయి. ఇంకా నాకు నాలుగు సంవత్సరాల సర్వీసు ఉంది. ఈ నాలుగేళ్లలో ప్రభుత్వం అందించే వివిధ కార్యక్రమాలను ప్రజల చెంతకు తీసుకుపోయి సేవ చేసే అవకాశం లభించడం సంతోషంగా ఉంది.

– జీ వెంకటేశ్వరరెడ్డి, ఎంపీడీఓ

పీఆర్ ఉద్యోగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ



పంచాయతీరాజ్ ఉద్యోగుల పదోన్నతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తోంది. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, అనేక శుభ పరిణామాలు చోటు చేసుకున్నాయి. రెండు దఫాలుగా అర్హులైన ఏఓ, ఈఓఆర్‌డీలకు ఎంపీడీఓలుగా పదోన్నతులు కల్పించడమే గాక, ఉద్యోగంలో చేరినప్పటి నుంచి ఎలాంటి పదోన్నతులకు నోచుకోని ఎంపీడీఓలకు పదోన్నతులు కల్పించారు. అలాగే డివిజన్ స్థాయిలో డీఎల్‌డీఓ పోస్టులను క్రియేట్ చేసి ప్రమోషన్లు ఇచ్చారు. పదోన్నతులు కల్పించడం సంతోషిదగ్గ విషయం.

– సీ మురళీమోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు, పీఆర్ మినిస్ట్రీయల్ ఎంప్లాయీస్ అసోసియేషన్

పదోన్నతులు పొందిన ఏఓల వివరాలు ...

పేరు	ప్రస్తుతం పనిచేస్తున్న ప్రాంతం	పదోన్నతిపై కేటాయించిన జిల్లా
సుధాకర్‌రాజు	చిప్పగిరి	అనంతపురం
దాసానాయక్	హొళగుంద	అనంతపురం
విజయశేఖర్‌రావు	ఆదోని	అనంతపురం
జగన్‌మోహన్‌రెడ్డి	కౌతాళం	వైఎస్సార్
విజయలలిత	మద్దికెర	అనంతపురం
జీ వెంకటేశ్వరరెడ్డి	గూడూరు	నంద్యాల
దశరథరామయ్య	మిడుతూరు	కర్నూలు
జీవీ సుబ్బరాజు	కొలిమిగుండ్ల	కర్నూలు
గోపీకృష్ణ	డ్వామా	నంద్యాల
కే సావిత్రి	గోస్పాడు	కర్నూలు
అల్లం శ్రీనివాసరావు	వెల్దుర్తి	నంద్యాల
విశ్వమోహన్	డోన్	కర్నూలు
సీవీ కొండయ్య	ప్యాపిలి	కర్నూలు
ఏ శ్రీనివాసరావు	ప్రకాశం	కర్నూలు

పదోన్నతులు పొందిన ఈఓఆర్‌డీల వివరాలు

వీరరాజు	తుగ్గలి	అనంతపురం
వెంకటరమణప్ప	పెద్దకడుబూరు	అనంతపురం
మోహన్‌కుమార్	కృష్ణగిరి	నంద్యాల
శివమల్లేశ్వరప్ప	సంజామల	కర్నూలు
ఏజీ శంకరశాస్త్రి	చిత్తూరు	నంద్యాల
ఐ సోలమన్	శిరివెళ్ల	అనంతపురం
వై పుల్లయ్య	పగిడ్యాల	అనంతపురం
ఎన్ భాగ్యలక్ష్మి	రుద్రవరం	వైఎస్సార్
పి సుమిత్రమ్మ	పాములపాడు	వైఎస్సార్
ఎం కవిత	ఆత్మకూరు	కర్నూలు
మణిమంజరి	జూపాడుబంగ్లా	కర్నూలు
వరలక్ష్మి	కౌతాళం	సత్యసాయి
యువీ రామానుజం	వైఎస్సార్	కర్నూలు

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య


మృతుడు సాయిప్రసాద్ (ఫైల్)

మద్దికెర: మండలంలోని బొమ్మనపల్లి గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ పురిమెట్ల సాయిప్రసాద్ (25) ఆదివారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. వెంకటేశులు, సీతమ్మ కుమారుడైన సాయిప్రసాద్ బెంగళూరులోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో విధులు నిర్వహిస్తున్నాడు. కొంతకాలంగా పనిఒత్తిడి భరించలేకపోతున్నానని, కంపెనీ మారాలనుకుంటున్నానని తల్లిదండ్రులకు చెప్పేవాడు. రెండు రోజుల క్రితం బెంగళూరుకు వెళ్లి.. తిరిగి వెంటనే స్వగ్రామానికి వచ్చాడు. ఆదివారం తెల్లవారుజామున అందరూ నిద్రిస్తున్న సమయంలో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

కుక్కల స్వైర విహారం

- ఐదుగురికి గాయాలు

డోన్ టౌన్: పట్టణంలోని పాతపేట, ఇందిరానగర్, తారకరామనగర్, సుందర్‌సింగ్ తదితర కాలనీల్లో ఆదివారం కుక్కల దాడిలో ఐదుగురు గాయపడ్డారు. పట్టణంలోని పాతపేట చౌడమ్మ కట్ట వద్ద ఓ వృద్ధురాలిపై వీధి కుక్క దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అలాగే వివిధ చోట్ల చోటు చేసుకున్న కుక్కల దాడిలో గాయపడిన వారు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి రేబీస్ ఇంజెక్షన్ వేయించుకున్నట్లు ఆసుపత్రి సిబ్బంది తెలిపారు.

క్లుప్తంగా

డ్వామా సిబ్బందికి స్థానచలనం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా నీటియాజమాన్య సంస్థ(డ్వామా)లో ఎక్కువగా ఉన్న సిబ్బందిని రేషనలైజేషన్‌లో భాగంగా ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. బదిలీ అయిన వారిని రిలీవ్ చేయడం మొదలైంది. ఏపీవోలు ఇద్దరు బదిలీ కాగా వీరిని రిలీవ్ చేశారు. ఇంజినీరింగ్ కన్సల్టెంట్లు ఇద్దరు బదిలీ కాగా... ఒకరిని రిలీవ్ చేశారు. సాంకేతిక సహాయకుల్లో 81 మంది బదిలీ చేయగా.. 58 మంది రిలీవ్ చేశారు. మిగిలిన వారు కోర్టు ఆదేశాలతో ఇక్కడే కొనసాగుతున్నారు, 53 మంది కంప్యూటర్ ఆపరేటర్లు బదిలీ కాగా..43 మందిని రిలీవ్ చేయగా మిగిలిన వారు కోర్టు ఆదేశాలతో ఇక్కడే కొనసాగుతున్నారు. ఇప్పటి వరకు జిల్లా స్థాయిలో 104 మంది, మండల స్థాయిలో 76 మందిని రిలీవ్ చేశారు.

విద్యుత్ శాఖలో బదిలీలు

కర్నూలు(రాజ్‌విహార్): సాధారణ బదిలీలు చేపట్టేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ట్రాన్స్‌కో, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థలు మార్గదర్శకాలు జారీ చేశాయి. ఇందులో భాగంగా మెడికల్, మ్యూచువల్, స్పౌజ్ అర్హతలు ఉన్న వారు ముందుగా బదిలీలకు దరఖాస్తు చేసుకుంటున్నారు. నెలాఖరులోగా బదిలీ ఉత్తర్వులు జారీ చేస్తామని కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎ. ఉమాపతి చెప్పారు.

ఫార్మాసిస్టు యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక


ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): ఏపీ ఫార్మాసిస్టు యూనియన్(2923) జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక ఏపీ ఎన్‌జీవో హోమ్‌లో నిర్వహించిన యూనియన్ సర్వసభ్య సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. ఎన్నికలకు ముఖ్యఅతిథిగా ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జవహర్ హాజరయ్యారు. ఉపాధ్యక్షులు సాంబశివారెడ్డి ఎన్నికల అధికారిగా, పి. క్రిష్టుడు అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా, బి. ప్రభాకర్‌రెడ్డి చీఫ్ అబ్జర్వర్‌గా వ్యవహరించారు. నూతన కార్యవర్గం అధ్యక్షుడిగా ఎ. రమేష్, జిల్లా కార్యదర్శిగా ఎం. భాస్కర్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కె. వెంకటరమణ, ట్రెజరర్‌గా వీఎస్‌వీజీ. క్రిష్ణమూర్తి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎ. మురళీధర్ ఎన్నికయ్యారు.

వాల్మీకి న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో వాల్మీకి న్యాయవాదులు

కర్నూలు(అర్బన్): కర్నూలులోని ఓ హోటల్ సమావేశ భవనంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అన్ని బార్ అసోసియేషన్లకు చెందిన వాల్మీకి న్యాయవాదులు తొలి ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. సీనియర్ న్యాయవాదులు టీ నాగభూషణనాయుడు, బీ గోపాలకృష్ణుడు మాట్లాడుతూ.. వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన వారిని విద్య, సామాజికపరంగా ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీనియర్ వాల్మీకి న్యాయవాదులు మద్దిలేటి స్వామి, ఎం ప్రభాకర్, అయ్యన్న, స్వాములు, బోయ మురళి, ఇంద్రాణి, శశిరేఖ, సంజమ్మ, వరలక్ష్మితో పాటు కర్నూలు, ఆదోని, డోన్, ఆళ్లగడ్డ, ఆలూరు, బనగానపల్లె, పత్తికొండ, ఎమ్మిగనూరు, నంద్యాల, నందికొట్కూరు బార్ అసోసియేషన్ల నుంచి వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన న్యాయవాదులు పాల్గొన్నారు.

జైల్లో జతకట్టి.. నేరాలబాట

- పాతనేరస్తుల నుంచి రూ.18 లక్షల విలువ చేసే బంగారు నగలు రికవరీ


చోరీ కేసులో నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు


దొంగల నుంచి రికవరీ చేసిన బంగారు నగలు

కర్నూలు : ముంగా శంకర్, సాయి శ్రీధర్ వీరిద్దరూ పాతనేరస్తులు. దొంగతనం కేసుల్లో హైదరాబాద్ పోలీసులకు వేర్వేరుగా పట్టుబడి చెర్లపల్లి జైలుకు వెళ్లారు. అక్కడ ఒకరికొకరు పరిచయమై బెయిల్‌పై బయటకు వచ్చి ఇద్దరూ కలిసి జిల్లాలో పలుచోట్ల దొంగతనాలకు పాల్పడి పోలీసుల వలకు చిక్కి కటకటాలపాలయ్యారు. నంద్యాల జిల్లా బనగానపల్లె కొండపేటకు చెందిన ముంగా శంకర్, తెలంగాణ రాష్ట్రం సికింద్రాబాద్ కార్కానాకు చెందిన సాయిశ్రీధర్‌లు జట్టుగా ఏర్పడి ఓర్వకల్లు పోలీస్ స్టేషన్ పరిధిలోని నన్నూరు గ్రామం రాగమయూరి కాలనీలో జనవరి, ఏప్రిల్ మాసాల్లో పట్టపగలే దొంగతనాలకు పాల్పడ్డారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఓర్వకల్లు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తులో భాగంగా నిందితులిద్దరినీ ఆదివారం సాయంత్రం నన్నూరు గ్రామ శివారులోని కర్నూలు నంద్యాల హైవే రోడ్డులో జరీషాఖాద్రీ దర్గా మలుపు వద్ద అదుపులోకి తీసుకుని కర్నూలు డీఎస్పీ కె విజయ్‌శేఖర్ ఎదుట హాజరు పరిచారు. సాయంత్రం కర్నూలు రూరల్ తాలూకా పోలీస్ స్టేషన్‌లో సీఐ శ్రీనివాసరెడ్డి, ఓర్వకల్లు ఎస్‌ఐ ఎన్‌సీ మల్లికార్జున, ఉలిందకొండ ఎస్‌ఐ నల్లప్పలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి డీఎస్పీ వివరాలు వెల్లడించారు. రాగమయూరి కాలనీలో పట్టపగలే తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని వీరు చోరీలకు పాల్పడినట్లు డీఎస్పీ వెల్లడించారు. వీరి వద్ద నుంచి రూ.18 లక్షలు విలువ చేసే 334.896 గ్రాములు బంగారం నగలు, నేరానికి ఉపయోగించిన హీరోహోండా ఫ్యాషన్ ప్లస్ మోటర్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వెల్లడించారు. నిందితులిద్దరినీ కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు డీఎస్పీ విజయ్‌శేఖర్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


మృతుడి బంధువులతో మాట్లాడుతున్న సీఐ

ఆత్మకూరు: పట్టణంలోని ఎస్బీజీ పాలెంకు చెందిన దివాకర్ అనుమానాస్పద స్థితిలో ఆదివారం మృతి చెందాడు. ఆత్మకూరు నుంచి శ్రీపతిరావు పేటకు వెళ్లే పాత రస్తాలో చింతచెట్టుకు ఉరేసుకుని మృతి చెందినట్లు గుర్తించారు. తొలుత గుర్తు తెలియని మృతదేహంగా భావించారు. అయితే పోలీసులు, పట్టణ ప్రజలు మృతుడిని గుర్తించారు. అనంతరం మృతుడి బంధువులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అనంతరం వారు ప్రభుత్వ వైద్యశాల నుంచి ఆత్మకూరు పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని తమకు న్యాయం చేయాలని బైఠాయించారు. మృతుడు గతంలో ప్రేమ వ్యవహారంలో జైలుకు వెళ్లివచ్చినట్లు సమాచారం. తాజాగా ఓ చోరీ కేసులో కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించినట్లు తెలిసింది. ప్రేమించిన యువతి తల్లిదండ్రులే దివాకర్‌ను హత్యచేసి ఆత్మహత్యలా చిత్రీకరించారని బంధువులు ఆరోపిస్తున్నారు. ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు విచారణ చేసున్నారు.

యువకుడి అదృశ్యం


పునీత్ (ఫైల్)

చాగలమర్రి: స్థానిక మల్లెం వీధికి చెందిన పునీత్ కుమార్ అనే యువకుడు ఐదు రోజులుగా కనిపించడం లేదు. స్థానిక వాసవీ డిగ్రీ కళాశాలలో అటెండర్‌గా పని చేస్తున్న పునీత్ ఈనెల 23న కళాశాలకు వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, చుట్టు పక్కల గ్రామాల్లో గాలించిన ఆచూకీ లభ్యం కాలేదు. ఆదివారం యువకుడి తండ్రి వాసుదేవయ్య ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని, ఆచూకీ తెలిసిన వారు 9121101168కు సమాచారం అందించాలని ఎస్‌ఐ రమణయ్య తెలిపారు.

నీటి సంపులో పడి ఐదేళ్ల బాలుడి మృతి

కర్నూలు: నిర్మాణంలో ఉన్న నీటి సంపులోపడి ఐదేళ్ల బాలుడు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. బాలాజీ నగర్‌లో నివాసం ఉంటున్న జమీర్‌సిద్ధిఖాన్ మారుతి షోరూంలో పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆయనకు ముగ్గురు కుమారులు. అందులో చివరి కుమారుడైనా జబిసిద్ధిక్‌ఖాన్(5) ఆదివారం సాయంత్రం ఇంటి బయట ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో ఆ బాలుడు ఇంటి పక్కన నిర్మాణంలో ఉన్న నీటి సంపులో పడిపోయాడు. పిల్లాడు కనిపించకపోయే సరికి తల్లిదండ్రులు సమీపంలో వెతికారు. అయితే ఆ బాలుడి చెప్పులు నీటిపై తేలాడుతుండడంతో తోడి చూడగా బాలుడు మృతి చెందినట్లు గమనించారు. కుటుంబ సభ్యులు ఆ ఇంటి వాచ్‌మెన్ తిమ్మప్పపై కర్నూలు అర్బన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది.

వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని కర్నూలు మెడికల్ కాలేజ్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్ అన్నారు. అనెస్థీషియా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం కళాశాలలోని న్యూలెక్చరర్ గ్యాలరీలో జోనల్–6 సీఎంఈ నిర్వహించారు. ఈ సీఎంఈకి కర్నూలు, అనంతపురం, కడప ప్రభుత్వ మెడికల్ కాలేజీలతో పాటు విశ్వభారతి, శాంతిరామ్ మెడికల్ కాలేజీల నుంచి 123 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఇందులో ఆరు అంశాల గురించి అనెస్థీషియా వైద్యులు డాక్టర్ జి.విశాల, డాక్టర్ ఎం. మంజుల, డాక్టర్ ఎ.నవీన్‌కుమార్, డాక్టర్ సునీల్‌కుమార్, డాక్టర్ సి. సునీల్, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ ఎ. క్రిష్టఫర్, డాక్టర్ జె. సుధీర్ కుమార్, డాక్టర్ కొండారెడ్డి, డాక్టర్ అనిల్ వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీకుమార్‌ను సన్మానించారు. వైస్ ప్రిన్సిపాల్, జోనల్ సీఎంఈ కో ఆర్డినేటర్ డాక్టర్ సాయిసుధీర్, ప్లాస్టిక్ సర్జరీ హెచ్‌వోడీ, ఏపీఎంసీ అబ్జర్వర్ డాక్టర్ మంజులాయి పాల్గొన్నారు.

సీతారామ్ న్యూక్లియర్ స్కాన్స్ ప్రారంభం


స్కాన్స్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ డబ్ల్యు సీతారామ్

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని వెంకటరమణ కాలనీలో ఆదివారం సీతారామ్ న్యూక్లియర్ స్కాన్స్‌ను ప్రముఖ సీనియర్ న్యూరోసర్జన్ డాక్టర్ డబ్ల్యు సీతారామ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యాధునికమైన స్కానింగ్ యంత్రాలను కర్నూలులో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మేనేజింగ్ డైరెక్టర్లు డాక్టర్ జె.మోహన్‌రూప్, డాక్టర్ ఎ.నవీన్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ సందీప్‌రెడ్డి మాట్లాడుతూ రాయలసీమలోనే మొట్టమొదటిసారిగా కర్నూలు నగరంలో పెట్/సీటీ స్కాన్, న్యూక్లియర్ మెడిసిన్, గామా స్కాన్‌లను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. పెట్‌స్కాన్ వల్ల శరీరంలో క్యాన్సర్ ఎక్కడ, ఏ స్థాయిలో ఉందో గుర్తించవచ్చన్నారు. అలాగే గామా స్కాన్ ద్వారా అన్ని అవయవాలను నిశితంగా స్కాన్ చేయవచ్చన్నారు.

పత్తికొండ కళాకారుడికి పురస్కారం


అవార్డు అందుకుంటున్న లక్ష్మీనారాయణ

పత్తికొండ రూరల్: పత్తికొండకు చెందిన ప్రముఖ రంగస్థల నటుడు సీవీ లక్ష్మీనారాయణస్వామి అంతర్జాతీయ నంది అవార్డు అందుకున్నారు. ఆదివారం కర్ణాటక రాష్ట్రంలోని హంపిలో జరిగిన శ్రీకృష్ణదేవ రాయ నృత్యోత్సవ సభలో కవులు, కళాకారుల సమక్షంలో హాస్పేట్ ఎమ్మెల్యే గవియప్ప, ఇతర ప్రముఖుల చేతుల మీదుగా లక్ష్మీనారాయణకు అవార్డు అందజేశారు. చిన్ననాటి నుంచి రంగస్థల నాటకాలపై మక్కువ పెంచుకున్న ఈయన ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లో సైతం అనేక ప్రదర్శనలు ఇచ్చారు. రంగస్థల నాటకాల్లో విశేష ప్రతిభను కనపరిచినందుకు గాను అవార్డు దక్కింది. స్థానిక కళాకారులు అవార్డు అందుకున్న లక్ష్మీనారాయణస్వామిని అభినందించారు.

వర్షాధార భూముల్లో పచ్చిరొట్ట వేద్దాం

- పెరిగిన పంటలను భూమిలోకి దున్నేయాలి
- అవి పచ్చిరొట్ట ఎరువుగా తోడ్పడతాయి
- వరి, రాసులను ఉప్పు ద్రావణంతో పిచికారీ చేసుకోవాలి
- బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త సూచనలు



కర్నూలు(అగ్రికల్చర్) : పచ్చిరొట్ట ఎరువుల సాగుతో ప్రధాన పంటలకు అన్ని రకాల పోషకాలు లభిస్తాయి. ముందుగా గత ఖరీఫ్, రబీ సీజన్‌లలో వర్షాధారం కింద పంటలు సాగు చేసిన భూములను దున్నుకోవాలి. ఆ తర్వాత పెసర, పిల్లిపెసర, మినుము వంటి పచ్చిరొట్ట ఎరువులు సాగు చేయాలి. అవి ఒకస్థాయికి వచ్చిన తర్వాత వాటిని పొలంలోనే దున్నేసుకుంటే ఆ తర్వాత సాగు చేసే ప్రధాన పంటలకు అన్ని రకాల సూక్ష్మ, స్థూల పోషకాలు, ప్రధాన పోషకాలు అందుతాయి. ప్రస్తుతం జిల్లాలో అక్కడక్కడా వర్షాలు పడుతుండటంతో రైతులు పచ్చి రొట్ట ఎరువుల వినియోగంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. దీని వల్ల కలిగే ఉపయోగాలు, అరటి, మామిడి తదితర వాటి తీసుకోవాల్సిన చర్యలను తంగడంచె బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త సుజాతమ్మ (77023 66115) వివరించారు.

నీటి ఆధారం కింద వరి సాగు చేసే రైతులు పచ్చిరొట్ట ఎరువులను ఎక్కువగా ఉపయోగిస్తారు. వర్షాధారపు భూముల్లో సాగు చేసే పంటలకూ వీటిని ఉపయోగించవచ్చు. నేలను దున్నుకుని ఎకరాకు 8 నుంచి 10 కిలోలు పెసర, మినుము, పిల్లిపెసరల్లో ఏదో ఒకటి వేసుకోవాలి. దున్నిన పొలాల్లో విత్తనాలను వెదజల్లితే సరిపోతుంది అవి ఎంతవరకు పెరుగుతాయో పెరగనిచ్చి తర్వాత పొలంలో కలిసే విధంగా దున్నేసుకోవాలి. భూమిలో ఈ పంటలు కుళ్లి పచ్చిరొట్ట ఎరువుగా తోడ్పడతాయి. దీనివల్ల పంటలకు నత్రజని, భాస్వరం, పొటాష్ అన్నీ అవసరమైన మేర లభిస్తాయి. అలాగే అన్ని రకాల సూక్ష్మజీవులు, బ్యాక్టీరియా, మిత్ర శిలీంద్రాలు అభివృద్ధి చెంది పంటలకు కావాల్సిన సూక్ష్మ, స్థూల పోషకాలు పుష్కలంగా అబిస్తాయి. పచ్చి రొట్ట ఎరువుల వాడకం వల్ల పెట్టుబడి వ్యయం బాగా తగ్గించుకోవచ్చు. వేరు వ్యవస్థ బలపడుతుంది. దీనివల్ల పంట దిగుబడికి వచ్చే అవకాశం ఉండదు. ట్రైకోగ్రామ మిత్ర బ్యాక్టీరియా, సూడోమోనాస్‌లు వృద్ధి చెందడం ద్వారా పంటలకు అవసరమైన అన్ని పోషకాలు లభిస్తాయి.

వరి రాసులకు ఉప్పు ద్రావణం పిచికారీ

రబీలో వేసిన వరి పంట కోతకు వచ్చిన తర్వాత గత నెలలో కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. నూర్పిడి చేసి కుప్ప పోసి వర్షాలకు తడిచి ఉంటే ఉప్పు ద్రావణం పిచికారీ చేయడం వల్ల ధాన్యం మొలక రాకుండా బూజు పట్టకుండా ఉంటుంది. లీటరు నీటికి 5 గ్రాముల ఉప్పు కలిపి కుప్పపైన తగిన మోతాదులో పిచికారీ చేసుకోవాలి. లేకపోతే తడిచిన వరి ధాన్యంబూజు పట్టడం,మొలకెత్తడం జరిగే ప్రమాదం ఉంటుందని శాస్త్రవేత్త సుజాతమ్మ వెల్లడించారు.

అరటిలో ఈ జాగ్రత్తలు తీసుకోవాలి...

వర్షాలు, గాలులతో అరటి పంటకు మహానంది తదితర ప్రాంతాల్లో నష్టం జరిగింది. వర్షాల కారణంగా పోషకాలు కొట్టుకునిపోయి ఉంటాయి. బూస్టర్ డోస్ ద్వారా అరటికి పోషకాలు ఇవ్వాల్సిన అవసరం ఉంటుంది. ఎకరాకు 20 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ కలిపి మొదళ్ల దగ్గర వేయాలి. ఇలా వేయడం భారమనుకుంటే లీటరు నీటికి యూరియా లేదా 19-19-19 కలిపి అరటి చెట్టు బాగా తడిచే విధంగా పిచికారీ చేయాలి.

మామిడిలో ఇలా చేయాలి...

వర్షాల వల్ల పూత, పిందె, కాయకు వచ్చిన మామిడిలో సూక్ష్మ పోషకాల లోపం ఏర్పడే ప్రమాదం ఉంది. దీని నివారణకు జింక్ సల్ఫేట్ 2 గ్రాములు మెగ్నీషియం సల్ఫేట్ 5 గ్రాములు, బోరాన్ 2 గ్రాములు, ఫెర్రస్ సల్ఫేట్ 4 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకుంటే తగిన మోతాదులో సూక్ష్మ పోషకాలు లభిస్తాయి.

లోతు దుక్కులు దున్నుకోవాలి

వర్షాధారం కింద పంటలు సాగు చేసే భూముల్లో వర్షాలకు లోతు దుక్కులు దున్నుకోవాలి. లోతు దుక్కిలు మూడేళ్లకోసారి దున్నుకుంటే మంచిది. 15 నుంచి 20 సెంటీమీటర్ల లోపు దున్నుకోవాలి. ఇలా దున్నుకోవడం వల్ల భూమిలో ఉండే చీడ, పీడలు, పురుగులు, ప్యూపాలు బయటపడి చనిపోతాయి. భూమిపైన ఉండే చెత్తాచెదారం భూమిలోకి వెళ్లి కుళ్లి ఎరువుగా ఉపయోగపడతాయి. లోతు దుక్కిల వల్ల భూమిలో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. భూమి ఆరోగ్య స్థితి మెరుగుపడుతుంది.